అరసవల్లిలో 'స్వచ్ఛ భారత్'

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అరసవల్లి సూర్యనారాయణ ఆలయ పరిసరాల్లో టూరిజం క్లబ్, రోటరీ, శర్వాణి విద్యార్థులు సంయుక్తంగా స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ప్రధానంగా ఆలయ పరిసరాల్లో పెద్దఎత్తున చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి ఎన్.,నారాయణరావు, గీతాశ్రీకాంత్, సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు, నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, ఇంటెక్ పూర్వ కన్వీనర్ రాధాప్రసాద్, నెహ్రు యువ కేంద్ర అకౌంటెంట్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు మోడీ ద్రోహం

- అభివృద్ధికి దోహదపడుతున్న ఉక్కును అమ్మేస్తున్నారు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం ధ్వజం

సోంపేట : మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణమూర్తి

మందస : మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేయడం ద్వారా మోడీ ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర జిల్లాలో మూడో రోజైన శనివారం కొనసాగింది. ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, మందస, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతున్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని చూడటం దారుణమన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, లేకుంటే మరింత వెనుక బడుతుందని చెప్పారు. రాష్ట్రంలో లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక పరిశ్రమ విశాఖ స్టీల్ అని చెప్పారు. ఉత్తరాంధ్రలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ పక్షమా? ఆంధ్రప్రదేశ్ పక్షమా చెప్పాలన్నారు. తెలుగు ప్రజలు పోరాడి 32 మంది ప్రాణత్యాగాలతో, 16 వేల మంది రైతుల త్యాగ ఫలంగా సాధించుకున్న ఈ ప్లాంట్‌ను ప్రజల సహకారంతో రక్షించుకుంటామని చెప్పారు. ఉత్పత్తిని ఏకపక్షంగా తగ్గించి వేసింది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ను నిలిపివేసింది. ఉన్నత స్థాయి అధికారులతో సహా అనేక ఖాళీలను నింపడం లేదు. రోజువారీ పనులకు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ కూడా లేకుండా చేస్తోందని విమర్శించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ మాట్లాడుతూ దేశంలోని ప్రైవేట్ రంగంతో సహా అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత ముడి సరుకులను, గనులను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు మాత్రం సొంతగనులు కేటాయించేందుకు నిరాకరిస్తోందని ధ్వజమెత్తారు. స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం చేరుకున్న బైక్ యాత్రకు సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథంతోపాటు నాయకులు మాట్లాడారు.

కంచిలిలో...

కంచిలికి చేరుకున్న బైక్ యాత్రకు కంచిలి మండల పార్టీ, ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు కప్ప గోపీనాథ్, పిట్ట కష్ణ, రఘు, స్వాగతం పలికారు. కంచిలిలో నిర్వహించిన సభకు కంచిలి వైసిపి జడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కష్ణారావు సభకు హాజరై సంఘీభావం తెలిపారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఆంధ్ర ఉక్కు కర్మగారాన్ని ప్రైవేటుపరం కానీయ కూడదన్నారు. అన్ని పార్టీలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

సోంపేటలో

సోంపేటకు చేరుకున్న బైక్ యాత్రకు మండల పార్టీ, ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, జుత్తు సింహాచలం, వల్లభరావు, రాజు, కర్రి సింహాచలం, మన్మథరావు, టి.పాపారావు, యామయ్య తదితరులు స్వాగతం పలికారు. సోంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ వై.కృష్ణమూర్తి సంఘీభావం తెలిపి మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అన్యాయమని, కేంద్ర ప్రభుత్వం తీరుపై అంతా కలిసికట్టుగా ఎదిరించాలన్నారు రాజకీయాలకు అతీతంగా పోరాటం సాగించాల్సిన తరుణంలో ఏ పార్టీ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు

మందసలో...

కంచిలి నుంచి బయలు దేరి మందస చేరుకున్నారు. సిపిఎం మండల పార్టీ నాయకులు దిలీప్, మట్ట ధర్మారావు, కె కేశవరావు, మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, స్పందన సంస్థ అధ్యక్షులు వడ్డి గోపాల్ తదితరులు స్వాగతం పలికారు. మందసలో వీరగున్నమ్మ స్థూపానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అక్కడ నుంచి సోంపేటకు చేరుకున్నారు

మెళియాపుట్టిలో...

మెళియాపుట్టి చేరుకున్న బైక్ రక్షణ యాత్రకు పార్టీ నాయకులు, ప్రజా, కార్మిక,రైతు సంఘాల నాయకులు సూరయ్య, పోలాకి ప్రసాదరావు స్వాగతం పలికారు. అక్కడ నుంచి పాతపట్నం, హిరమండలం మీదుగా కొత్తూరు చేరుకున్నారు

కొత్తూరులో...

కొత్తూరు చేరుకున్న బైక్ యాత్రకు సిపిఎం మండలం నాయకులు, ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు స్వాగతం పలికారు. డప్పు కళాకారులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికి పూల జల్లులు కురిపించారు. కొత్తూరు నాలుగురోడ్ల కూడలి చేరుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిర్ల ప్రసాదరావు, గంగరావు సింహాచలం, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం అప్పారావు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బైక్ నిమ్మక అప్పన్న, సిహెచ్.ప్రసాదరావు పాల్గొన్నారు.

పాతపట్నంలో...

పాతపట్నం చేరుకున్న బైక్ యాత్రలో సిపిఎం నాయకులు కె.సూరయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు పి.సింహాచలం పాల్గొన్నారు.

కొత్తూరు : సంఘీభావం తెలుపుతున్న ఐలూ నాయకులు

మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కంచిలి : మాట్లాడుతున్న కృష్ణారావు

రన్నింగ్ పోటీలో పాల్గొన్న వికలాంగులు

ఉన్నత లక్ష్యం ముందు వైకల్యం ఓటమి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉన్నతమైన లక్ష్యం ముందు అంగవైకల్యం ఓడిపోతుందని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి వికలాంగుల జిల్లా క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా ఆటలు, పాటలకు పెట్టింది పేరుని అన్నారు. ఎంతోమంది జిల్లా నుంచి వికలాంగులు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారని గుర్తు చేశారు. వీరు మైదానం వరకూ రావడమే పెద్ద గెలుపని, వారి తల్లిదండ్రులూ వీరికి మరింత ప్రోత్సాహాన్ని అందజేయాలని సూచించారు. సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకోవడానికి క్రీడలే ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. వికలాంగుల హక్కులు, రక్షణకు భారత ప్రభుత్వం 2016లో ప్రత్యేక చట్టం తీసుకొచ్చిందని అన్నారు.

147 మంది హాజరు

6-18 ఏళ్ల వయసు కలిగిన వారికి క్రీడా పోటీలు నిర్వహించారు. రన్నింగ్, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడల్లో జిల్లా నలుమూలల నుంచి 147 మంది వికలాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రోనంకి జయప్రకాష్, డిఇఒ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, జిల్లా సమగ్ర విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు పాల్గొన్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌తో మెరుగైన సేవలు

అదాలత్ చైర్మన్ జ్ఞానసువర్ణరాజు

మాట్లాడుతున్న చైర్మన్ సువర్ణరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి అధికారీ కృషి చేయాలని శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు సూచించారు. న్యాయ సేవా సదన్ కార్యాలయంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హైలెవెల్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం కలిగితే ఎవరైనా శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. అదాలత్‌కు సమస్యను బట్టి సంబంధితశాఖలకు ఆదేశించడానికి వీలుందన్నారు. అదాలత్ ద్వారా అందిస్తున్న సేవలు గురించి ప్రజల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి ఫీజులు లేకుండా కేసులు వేసేందుకు వీలుంటుందన్నారు. అలాగే కేసులకు సత్వర పరిష్కారం రెండు నెలల వ్యవధిలోపే దక్కుతుందన్నారు. గృహ నిర్మాణ సంస్థ, రెవెన్యూ, ప్రజా రవాణా సంస్థ, నగర పాలక సంస్థ, తపాలా, బ్యాంకింగ్, ఉపాధి హామీ, నీటి సరఫరా, పారిశుధ్యం, విద్య, బీమా, వైద్య సేవలు, విద్యుత్, టెలిఫోన్ తదితర సేవలు సమాజంలోని పౌరులకు పక్కాగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. సమావేశంలో జిల్లా గృహనిర్మాణం సంస్థ పీడీ నక్క గణపతి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

నేర సమీక్షలో ఎస్‌పి రాధిక

ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కేసుల దర్యాప్తు కచ్చితత్వంగా చేసి కేసులు విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సమన్వయంతో పని చేయాలని, శిక్షలు శాతం పెరిగేందుకు కృషి చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులకు ఎస్‌పి జి.ఆర్.రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో ఆగస్టు నెలకు సంబంధించిన కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించి ప్రమాదాలకు కారకులైన వారి లైసెన్స్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో సెప్టెంబరు నెలలో 29 తీవ్రమైన ప్రమాదాల కేసుల్లో 22 మంది వాహన చోదకులు లైసెన్స్ రద్దు చేశామని అన్నారు. ముఖ్యమైన కేసులు దర్యాప్తులో సాక్షులు విచారణ, ఆధారాలు సేకరణ, ప్రాపర్టీ స్వాధీనంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కోర్టులో కేసులు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు పాటించి నిర్ణిత సమయంలో నాన్ బెయిల్‌బుల్ వారంట్లు ముద్దాయలను కోర్టులో హాజరుపరిచాలన్నారు. జాతీయం రహదారిపై గల దాబాలు, షాప్స్, టైర్ పంచిరింగ్ దుకాణాలు వద్ద తప్పకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రమాదకరమైన ప్రదేశాలు గుర్తించి నిత్యం వాహనాల తనిఖీ చేసి, స్పీడ్ బ్రేకర్లు, విజిబుల్ రంగులు వేసి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఏ స్టేషన్ పరిధిలోని ప్రమాదాలు ఎక్కువగా జరిగినట్లు అయితే ఆయా పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహన చోదకులు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించి జిల్లాలో ప్రమాదాల నివారణకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవతం చేయాలన్నారు. అదృశ్యం కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. బీట్ బుక్ నిర్వహణ సక్రమంగా అమలు చేయాలన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని లోక్ అదాలత్ కేసులు పరిష్కారం చేయడంలో ప్రతిభ కనబరిచిన డిఎస్‌పి వై.శృతి, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ డిఎస్‌పిలు నాగేశ్వరరెడ్డి, బాలచంద్రరెడ్డి, దర్యాప్తు కేసులు, లోక్ అదాలత్ కేసులు పరిష్కారం, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ప్రతిభ కనబరిచిన సిఐ పి.పైడియ్య, ఎస్ఐలు బాలరాజు (కంచిలి), మధుసూదన్ (వజ్రపుకొత్తూరు), కృష్ణవర్మ (నౌపడ), విజయకుమార్ (శ్రీకాకుళం రూరల్), రాజేష్ (జె.ఆర్.పురం), లక్ష్మణరావు (పొందూరు), కృష్ణ(ఆమదాలవలస), మహిళా పోలీసులు రేవతి, సూర్య కుమారి, మర్య ఖాతున్ అనును అభినందిస్తూ... ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు, ఎస్‌బి డిఎస్‌పిలు ఎస్.బాలరాజు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.మల్లేశ్వరరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.తిరుమలరావు, కె.శంకరరావు, శ్రీకాంత్, ఎపిపిలు నాగభూషణం, సుశీల పాల్గొన్నారు.

అనంతరం విశాఖపట్నం సిటీ నూతన పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవికుమార్‌ని కమిషనర్ కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాని అందజేశారు.

జిపిఎస్ వద్దు

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర మంత్రివర్గం గ్యారంటీ పెన్షన్ స్కీం జిపిఎస్‌ను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. అధికారంలోకి రాకముందు ప్రస్తుత ముఖ్యమంత్రి సిపిఎస్‌ను వారం రోజులలో రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు దాటుతున్నా సిపిఎస్ రద్దు చేయలేదు సరి కదా, గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ పేరుతో ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసపుచ్చే విధంగా తయారైందని మండిపడ్డారు. పాత పెన్షన్ విధానం తప్ప మరేది ఆమోదించేది లేదని తేల్చిచెప్పారు. ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్ వల్ల ఏమాత్రం ప్రయోజనం కాదని అన్నారు. జిపిఎస్ అనేది పేరు మార్చే మోసమని అంకెల గారిడి మోసమని అన్నారు. గత పిఆర్‌సిలో అంకెలు గారిని చేసి ఏ రకంగా మోసం చేశారో... అదే రీతిలో జిపిఎస్ విధానం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసపుచ్చే విధంగా ఇచ్చిన మాట తప్పడం సరికాదన్నారు. టి.చలపతిరావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి అమలు చేయాలన్నారు. కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై ఈ పరిస్థితిని పోరాటంతో ఎదుర్కొంటామని పిలుపునిచ్చారు. చావలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా ప్రభుత్వం ఉద్యోగుల బాధ్యతలను క్రమక్రమంగా వదిలించుకుంటుందన్నారు. అందులో భాగమే జిపిఎస్ అమలు చేయడమని పేర్కొన్నారు. కొప్పల డేనియల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ రకమైన ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతాప్ మాట్లాడుతూ నిర్బంధాలతో ఆందోళనలను ఆపలేరని అన్నారు. తహశీల్దార్ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వై.ఉమాశంకర్, జి.సురేష్, డి.రామ్మోహనరావు, డి.రవి పాల్గొన్నారు.

పొందూరు : వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ విధానం అమలు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పొందూరు పాత తాలూకా కేంద్రం వద్ద శనివారం ఫ్యాప్టో, ఎపిసిపిఎస్ఇఎ సంయుక్తంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ నెల 25న చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చామని అన్నారు. అనంతరం తహశీల్దార్ వై.వి.ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్‌మోహన్, కో-చైర్మన్లు పొందూరు అప్పారావు, పూజారి హరిప్రసన్న, ఎపిసిపిఎస్ఇఎ మాజీ మక్క సురేష్, వివిధ సంఘాల బాధ్యులు మొగదాల రమణరావు, కోరుకొండ విజయ్‌కుమార్, కిలారి వెంకటరమణ, గండెం రామారావు, గురుగుబెల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

టెక్కలి : సామాజిక భద్రతకు మారుపేరుగా ఉన్న ఒపిఎస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా అమలుజేయాలని చూస్తున్న జిపిఎస్ విధానం రద్దు చేయాలని ఫ్యాప్టో, ఎపిసిపిఎ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ధనుంజయరెడ్డి, గున్న ప్రసాదరావు, పాలవలస ధర్మారావు, డి.లక్ష్మీనారాయణ, కుప్పిలి కామేశ్వరరావు, శ్రీనివాసరావు, బాబూరావు, వజ్జ ఆదినారాయణ పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో లండ బాబూరావు, ఎస్.చాణక్య, ఎన్.మోహనరావు, రమేష్ పాణిగ్రాహి, జి.రాజేష్, టి.చంద్రశేఖర్, బి.శోభన్‌బాబు, ఎస్.గోపి, ఎన్.రవి, డి.గోవిందరావు, ఎస్.కిరణ్ పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

టెక్కలి : నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

వైద్య విధాన మార్పులతో పెరిగిన జీవన కాలం

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆధునిక కాలంలో తాజాగా వస్తున్న వైద్య విధానం వల్ల దేశంలో ఆయుష్షును గణనీయంగా పెంచేందుకు మార్గాలు సుగమం అయ్యాయని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యాన నగరంలోని 80 అడుగుల రోడ్డులో శనివారం మారథాన్ రన్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో యువత ఈ రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడానికి వీలుగా జిల్లా కేంద్రంలో యూత్ ఫెస్ 5కె రెన్ మారథాన్ నిర్వహించామని పేర్కొన్నారు. యూత్ ఫెస్ట్ 5కె రెడ్‌ఆన్ మారథాన్ 2023 కలెక్టరేట్ నుంచి అరసవల్లి కూడలి వరకు నిర్వహించామన్నారు. ఇందులో 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.పది వేలు, ఇచ్ఛాపురానికి చెందిన సాయి కిరణ్ సాహు దక్కించుకున్నారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరానికి చెందిన తవిటిరాజు ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, జొన్నలపాలెంకు చెందిన పి.సంతోష్‌లు తృతీయ బహుమతిగా రూ.5 వేలు దక్కించుకున్నారు. మరో ఏడుగురికి రూ.1000 వంతున ప్రోత్సాహక బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నల్లబాటి అనురాధ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

మారథాన్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

ప్రజా సమస్యలు మరుగున పడి పోయే

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గత కొద్ది రోజులుగా ప్రజా సమస్యలన్నీ పక్కకు వెళ్లిపోయాయి. శాసనసభ బయట, లోపలా అంతా ఒక మాదిరిగానే ఉంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి, టిడిపి ప్రజా ప్రతినిధులెవరూ జిల్లా సమస్యలపై ప్రశ్నించిన దాఖలాలు లేవు. ప్రజల సమస్యలపై జిల్లాలోనూ ప్రశ్నించేవారే కరువయ్యారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టే ప్రధాన అజెండాగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలకయితే అది తప్ప వేరే అంశం కనిపించడం లేదు. రాజకీయాలపై కాస్తాకూస్తో ఆసక్తి ఉన్నవారు సైతం వీటిపైనే చర్చించుకుంటున్నారు. ఏ ఇద్దరు ముగ్గురు కలిసినా బాబు అరెస్టుతో ఎలా ఉండబోతోంది? టిడిపికి సానుభూతి పెరిగిందా? వైసిపికి నష్టం కలగబోతుందా? అనే అంశంపైనే మాట్లాడుతుండటం కనిపించింది. చంద్రబాబు అరెస్టుతో వైసిపికి రాజకీయంగా ఏ మేర లాభం కలిగిస్తోందో లేదో గాని ప్రభుత్వ వైఫల్యాల నుంచి జనం దృష్టి మరలించడంలో విజయవంతమైంది. జనం ఇతర సమస్యలపై ఆలోచించనీయకుండా చంద్రబాబు అరెస్టుపైనే చర్చించేలా చేయడంలో ప్రభుత్వం సఫలీకృతం అయింది. చంద్రబాబును అరెస్టు చేయడంతో అటు ప్రధాన ప్రతిపక్షం టిడిపికి మరో పని లేకుండా చేసింది. చంద్రబాబు అరెస్టు అక్రమం, వెంటనే విడుదల చేయాలని టిడిపి శ్రేణులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పంచాయతీల్లో నిధుల సమస్య, గృహ నిర్మాణ బిల్లులు, ధరలు వంటి సమస్యలన్నీ మరుగున పడిపోయాయి. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సెప్టెంబరు నాలుగో వారంలోకి ప్రవేశించినా పూర్తి స్థాయిలో రైతులు విత్తనాలు వేయలేకపోయారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 3,98,750 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటి వరకు 3,47,500 ఎకరాల్లో వేయగలిగారు. జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, కవిటి, నందిగాం, జి.సిగడాం మండలాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. వర్షాధారంపై ఆధారపడిన మెట్ట ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులే సాగునీటి కాలువ కింద ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఒడిశాలో కాస్తాకూస్తో వర్షాలు పడుతుండటంతో హిరమండలం గొట్టాబ్యారేజి వద్ద తగినంత నీటి నిల్వలు ఉండనే ఉన్నాయి. కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా అవి శివారు భూములను చేరడం లేదు. కాలువల్లో పెద్ద ఎత్తున పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇంజిన్లు పెట్టుకుని పొలాలను తడుపుకుంటున్నారు. కొన్నిచోట్ల ఆ అవకాశమూ లేకుండా పోయింది. వర్షాభావ పరిస్థితులతో పలు మండలాల్లో నీటి మట్టం నిల్వలు పడిపోవడంతో చెరువుల్లో నీరు అడుగంటిపోయింది. ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కడమెలా అనే దానిపై పాలకపక్షం కనీసం దృష్టి సారించడం లేదు.

పంచాయతీలకు ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన సుమారు రూ.75 కోట్లను ప్రభుత్వం దారి మళ్లింపు మొన్నటి వరకు సర్పంచ్‌లకు ఒక ఎజెండాగా ఉండేది. గ్రామాల్లో కనీసం పారిశుధ్యం పనులు చేపట్టడానికీ డబ్బులు లేవంటూ ఆందోళనలు సైతం చేశారు. ప్రస్తుతం వారంతా బాబు అరెస్టు చర్చలతో గ్రామాల్లో తీరిక లేకుండా ఉన్నారు. సందిట్లో సడేమియా అన్నట్లు జనం అంతా చంద్రబాబు అరెస్టు చుట్టూ చర్చల్లో ఉన్న సమయం చూసుకుని ప్రభుత్వం ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో జిల్లా వినియోగదారులపై సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు విద్యుత్ ఛార్జీల భారం వేసింది. అక్టోబరు బిల్లుల్లోనూ ఈ వాత కనిపించనుంది. ఇటీవల కొద్ది రోజుల కిందట వరకు కాస్తాకూస్తో విద్యుత్ ఛార్జీలపై ఆందోళనలు చేసిన టిడిపి చంద్రబాబు అరెస్టుతో వాటిని పక్కన పెట్టేసింది. బాబు అరెస్టు తర్వాత నిరాహార దీక్షలు, ఆలయాల్లో పూజలకే పరిమితమైంది. ధర్నాలు, ఆందోళనలు అంటే పోలీసులు వారిని బయటకు రానీయడం లేదు. టిడిపి ఆవిర్భావం తర్వాత ఎన్నడూ ఇంతటి నిర్బంధం చవిచూడని నాయకులు, శ్రేణులు ఇప్పుడా పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా రాజకీయ అంశాలపైనే పోరాడితే ఎలా ఉంటుందో చంద్రబాబు అరెస్టు సందర్భంగా చేపట్టిన బంద్ ఒక ఉదాహరణ. బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువవ్వడంతో జిల్లాలో పెద్దగా సక్సెస్ కాకపోవడం చూశాం.

చంద్రబాబు అరెస్టుపై అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్న తరుణంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం సిపిఎం నడుంబిగించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో బైక్ యాత్ర మొదలు పెట్టింది. ఈ నెల 21న పొందూరు మండలంలోకి ప్రవేశించిన యాత్ర మూడు రోజులు పాటు జిల్లాలో సాగింది. యాత్రకు జనం నీరాజనం పలికారు. కేంద్రంలోని మోడీ సర్కార్ స్టీల్ ప్లాంట్‌ను ఎవరికో అమ్మేస్తుందంటూ సామాన్య జనంలో ఒక చర్చకు తీసుకురావడంలో విజయవంతమైంది. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలో ఉంటేనే అభివృద్ధి జరిగిందని, మన జిల్లా వాసులకూ ఉద్యోగాలు వచ్చాయని చెప్పిన నాయకుల ప్రసంగాలు అందరినీ ఆలోచింపజేశాయి. మొత్తం మీద స్టీల్ ప్లాంట్ అంశం జనంలో ఒక చర్చకు తీసుకురావడంలో సిపిఎం చేసిన ప్రయత్నం సఫలీకృతం అయింది. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం ఎండనక, వాననక వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి జనాన్ని చైతన్యం చేసిన సిపిఎం ప్రయత్నాన్ని అభినందిస్తున్నారు.

కొర్లాం విద్యార్థికి బంగారు పతకం

బంగారు పతకంతో మహేష్

సోంపేట : మండలంలోని కొర్లాం గ్రామానికి చెందిన రామ్ బుద్ధి మహేష్‌కు ఐటీఐఎల్ గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్ జోన్ పోటీల్లో పరుగు పందెం విభాగంలో బంగారు పతకం లభించింది. ఈ నెల 21 నుంచి మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో మహేష్ వెయ్యి మీటర్ల విభాగంలో బంగారు పతకం, ఐదువేల మీటర్ల విభాగంలో వెండి పతకం సాధించాడు. అలాగే కర్లపాలెం గ్రామానికి చెందిన పి.చైతన్య 800 మీటర్ల పరుగు పందెం విభాగంలో కాంస్య పతకం సాధించాడు. వీరికి స్థానిక పెద్దలతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలను చర్చించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎ.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మె తప్పదని హెచ్చరించారు. శాసనసభ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులపై సమస్యలు చర్చించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా, అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ, రాజు, అర్జీ జనార్ధనరావు, అరుగుల రాము, ఆకుల మోహన్, ఆకుల శంకర్, అరుగుల గురుస్వామి, జలగదుగుల బుజ్జి ఈశ్వరరావు, అర్జీ రాజేష్ పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

జి.సిగడాం : మండలంలోని నడిమివలస ఎస్సీకాలనీ సర్కిల్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది శనివారం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి రోగాలపై సర్వే చేపట్టారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యాధికారులు ప్రతిష్టా శర్మ, అనూష తెలిపారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్తూ బిపి, సుగర్ రక్త పరీక్షలు చేసి ప్రజలకు మందులు అందిస్తున్నామని తెలిపారు. సర్పంచ్ ప్రతినిధి రమేష్, కార్యదర్శి కోటేశ్వరరావు, అనూషా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి దీక్షలు

పలాస : దీక్షలో పాల్గొన్న శివాజీ

పొందూరు : నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి అరాచక పాలనను అంతమొందించిన నాడే రైతులకు మేలు జరుగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్చార్జ్ కూన రవికుమార్ అన్నారు. శనివారం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నిరసనగా నేను సైతం బాబు కోసం రిలే నిరాహార దీక్షల్లో రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాస్థలి వద్దకు రవికుమార్ చేరుకొని వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులను పట్టించుకోకుండా అసమర్థ నిర్ణయాలతో వారి వెన్ను విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి కాలువల పూడిక పనులు చేపట్టకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా పూడికతీతల పనులు చేపట్టడం చూస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులు టిడిపి హయాంలో ప్రారంభమై త్వరితగతిన పనులు ముందుకు సాగగా నేడు నిలిచిపోయిన దుస్థితి వైసిపి ప్రభుత్వంలో నెలకొందని మండిపడ్డారు. టిడిపి హయాంలో రైతు రథం పథకం కింద రైతులకు ట్రాక్టర్లను ఇతర పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేశామని, నేడు ఆ పరిస్థితి ఉన్నదా అని రైతులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు టి.వి. రమణమూర్తి, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, అన్నెపు భాస్కరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు,సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకిలో టిడిపి నాయకులు చేపట్టిన దీక్షకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు.

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ శనివారం టిడిపి ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు ప్రారంభించారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ఎస్సీ సెల్ నాయకులు ఎస్.వి.రమణ మాదిగ, గోర సురేష్, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.

పలాసలో చేపట్టిన ధర్నాలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మాజీ ఎంపిపి దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు పాల్గొన్నారు.

చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా ఇచ్ఛాపురంలో చేపట్టిన నిరసన దీక్షలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, సూరాడ చంద్రమోహన్, చెల్లారు ధర్మారావు, తామాడ పాపారావు, బూర్లె లింగరాజు, దున్న సోమశేఖర్, గుండపల్లి కూర్మారావు, లోకనాథ్ మహంతి పాల్గొన్నారు. ముందుగా బాబుకు మద్దతుగా పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు.

పొందూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ ఆధ్వర్యాన టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారికి సంఘీభావంగా కార్యాలయం బయట టిడిపి నాయకులు కూర్చొని నినాదాలు చేశారు. కార్యాలయంలోకి టిడిపి నాయకులను వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో మొదలవలస సీతారారామారావు, వేణుగోపాలం, పోలినాయుడు, రాంప్రసాద్, హనుమంతురావు, శ్రీనివాసరావు, రాజయ్య, బాడాన హారిక, అన్నెపు కుమారి, మణెమ్మ, వాణి, శ్రీలక్ష్మి, నాయకులు బలగ శంకరభాస్కరరావు, అన్నెపు రాము, కృష్ణవాసుదేవరావు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఐక్య కార్యాచరణలో భాగంగా సిఐటియు, ఎఐటీయూసి, ఐఎఫ్టియు సంఘాలు డిమాండ్ చేస్తూ ఈ నెల 25వ తేదీన విజయవాడలో సామూహిక ధర్నా నిర్వహిస్తున్నామని అంగన్వాడి సెక్టార్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు పి. భూలక్ష్మి ప్రాజెక్ట్ జిల్లా సహాయక కార్యదర్శి పి. లతాదేవి తెలిపారు. శనివారం పట్టణంలోని సిడిపిఒకు ధర్నా కార్యక్రమాన్ని తెలియజేసేందుకు కార్యాలయానికి రాగా అందుబాటులో లేకపోవడంతో ఆమెను సెల్‌ఫోన్లో సంప్రదించగా కార్యాలయం గోడకు అంటించాలని తెలియజేయగా అలాగే చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, మినీ వర్కర్స్, హెల్పర్స్ కనీస వేతనాలు చెల్లించాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీని రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్‌లను తక్షణమే మెయిన్ సెంటర్‌లుగా మార్చాలని, మినీ వర్కర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె. మాధవి, జి. భారతి తదితరులు పాల్గొన్నారు.

పలాస: అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని వత్తిడి తగ్గించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ అధికారులకు శనివారం ఈ నెల 25న విజయవాడ ధర్నాకు వెళ్తున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కె జ్యోతి, నాయకులు ఎస్ కె భీబి, ఎస్.సుమతి పాల్గొన్నారు.

నేషనల్ యోగా రిఫరీగా ఈశ్వరరావు

ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో యోగా అధ్యాపకులు డాక్టర్ ఈశ్వరరావు నేషనల్ యోగా రిఫరీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును ట్రిబుల్ ఐటి డైరెక్టర్ ఆచార్య జగదీశ్వరరావు శనివారం అభినందించారు. డాక్టర్ ఈశ్వరరావుకు యోగాలో మంచి పేరు ప్రత్యేకలు తీసుకుని రావాలని అన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ కోర్లమోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సల్లా ఆసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేస్తున్న జగదీశ్వరరావు

అంతరిక్ష పరిశోధనా నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలరించిన ప్రదర్శన

టెక్కలి : స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శనివారం అంతరిక్ష పరిశోధనా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హిస్టరీ ఆఫ్ స్పేస్, వరల్డ్ ఆర్గనైజేషన్ రిలేటెడ్ టు స్పేస్, స్పెషల్ ఫోకస్ ఆన్ చంద్రయాన్ అనే ఇతివృత్తంతో ఒక్కరోజు చేపట్టిన కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన కృత్రిమ ఉపగ్రహల నమూనా, ఉపగ్రహ ప్రయాణ నమూనా వీక్షకులను ఆకట్టుకుంది. ఇటువంటి వారోత్సవాలు విద్యార్థుల్లో నిబిడీకృతమైన విజ్ఞానాన్ని వెలికితీస్తుందని రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ ఎం.ఎస్,మణి అన్నారు. గతేడాది నాసా నిర్వహించిన స్పేస్ పోటీ పరీక్షల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణమూర్తి

జిల్లాస్థాయి కబడ్డీ జట్టుకు విద్యార్థి ఎంపిక

మందస : మందస మండలం బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి కొర్నాన కార్తీక్ జిల్లాస్థాయి కబడ్డీ జట్టుకి ఎంపికయ్యాడు. పాఠశాల క్రీడా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన అండర్ 17 కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో కార్తీక్ ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు అంబటి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

సామాజిక బాధ్యత అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి చదవుతో పాటే సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, అప్పుడే మంచి విద్యావంతులు కాగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పేర్కొన్నారు. నగరంలోని పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థి దశలో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడంతో మంచి నడవడిక అలవడుతుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ చీఫ్ కో-ఆర్డినేటరు ప్రొఫెసర్ ఎం.అనురాధ మాట్లాడుతూ దేశంలో సుమారుగా 4 కోట్ల మంది వాలంటీర్లు 400 విశ్వవిద్యాలయాలలో భాగస్వామ్యమై సమాజ సేవలో సామాజిక రుగ్మతల నిర్మూలనలో తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆర్ట్స్ కాలేజి ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బీమా నమోదుపై అవగాహన

నందిగాం: బీమా నమోదుపై నందిగాం మండలంలో పలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. దిమ్మిడుజోల, కల్లాడ, నౌగాం సచివాలయాల పరిధుల్లో జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి జద్యాడ జయరాం ఆధ్వర్యంలో బీమా నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో ఉన్న సచివాలయ గృహసారథులు బీమా నమోదు చేసుకోవాలని, 25వ తేదీ చివరి రోజు అని, జెసిఎస్ సైన్యం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెగల లక్ష్మీకాంతం, కూర్మారావు. , ఎక్స్.పిఎసిఎస్ అధ్యక్షులు బలరాం స్వామి. నౌగాం సర్పంచ్, ఎంపీటీసీ పుష్ప సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న వాణి

మానసిక ఒత్తిడిని జయించాలి

టెక్కలి : సమాజంలో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడిని జయించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాలని టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి గార పగడాలమ్మ మాట్లాడుతూ విద్యార్థిస్థాయి నుంచే పోటీతత్వం అలవడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అట్ల సరోజనమ్మ, సర్పంచ్‌లు సర్లాన బాలకృష్ణ, గుజ్జు మోహన్‌రెడ్డి, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దానుపురం చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు డి.భారతి, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, ఆదిశేషు, కుప్పిలి ప్రకాష్, లక్ష్మణరాజా, యరపత్ని వెంకటరమణ, జగ్గమ్మ, కె.కె.రామిరెడ్డి, నాగళ్ల రమేష్, యాగాటి త్రినాథరావు, అలివేణి, తాళ్లభద్ర ధర్మారావు, మార్పు నారాయణమూర్తి, భాస్కరరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

టెక్కలి రూరల్ : జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా కషి చేయాలని వైసిపి టెక్కలి ఇన్‌చార్జ్ జడ్పిటిసి దువ్వాడ వాణి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్ని గ్రామాలకు ఇంటింటికి పైపులైను నిర్మాణాలు చేపట్టారు, ఇంకా ఎన్ని గ్రామాలు మిగిలి ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్‌కల్లా మండలంలో ప్రతి గ్రామానికి ఇంటింటికి కుళాయిలు అందజేయాలన్నారు. ఈ సమీక్షలో డిఇ విజయరాజ్, ఎఇ.మోహన్ ఉన్నారు.

రక్తదానంపై అపోహలొద్దు

ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో 'మేము సైతం' పేరిట ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులను స్ఫూర్తిగా తీసుకొని యువత మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహించాల న్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు రావని, నూతనోత్సాహంతో ఉంటారని అన్నారు. మగ వారు రక్తదానానికి వెనుకడుగు వేస్తున్న తరుణంలోనూ వారికి ధీటుగా వంద మంది యువతులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, మోడల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, జామీ భీమశంకరరావు, పెంకి చైతన్య, చిన్మయరావు, కె.సత్యనారాయణ, సుజాత, పవన్, ఎన్ఎస్ఎస్ పిఒ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పద్మావతి'లో యానిమేషన్ వర్క్‌షాప్

మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

నరసన్నపేట : యానిమేషన్ పరిశ్రమ వేగంగా ఎదుగుతూ వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని, నైపుణ్యం గల విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు కలిగిస్తుందని హలో వరల్డ్ యానిమేషన్ సిఇఒ ఉదయ కుమార్ తెలిపారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో శనివారం యానిమేషన్ కోర్సుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఊహలను బొమ్మలుగా చిత్రించి వాటికి ప్రాణం పోయడమే యానిమేషన్ అని తెలిపారు .ఒకప్పుడు వినోద రంగానికే పరిమితమైన యానిమేషన్ ఫీచర్లు నేడు అన్ని రంగాల్లోనూ విస్తరించాయని చెప్పారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ కంప్యూటర్ గ్రాఫిక్స్, అన్నపూర్ణ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా ఈ కోర్సులను అందజేస్తుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చదువుతోపాటు ఏదో ఓ రంగంలో నిష్ణాతులుగా తయారు కావడం అవసరమని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాస: కాశీబుగ్గ ఐసిడిఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాశీబుగ్గ ఐసిడిఎస్ అధికారిణి పి.శార్వాణి ఒక ప్రకటనలో తెలిపారు. పలాస మండలంలో సుమ్మాదేవి అంగన్వాడీ కేంద్రంలో ఆయా -ఒసి, ఇబిసి, వజ్రపుకొత్తూరు మండలం పూడి జగన్నాధపురం అంగన్వాడీ కేంద్రంలో ఆయా - ఒసి, మందస మండలం హరిపురం-4 అంగన్వాడీ కేంద్రానికి ఆయా -ఎస్సి, గెడ్డూరు - ఎస్సి పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయా కులాలకు చెందిన అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసిడిఎస్ కార్యాలయానికి తమ ధరఖాస్తులను అందజేయాలని కోరారు. ఇంటర్వ్యూలు నిర్వహించేస్థలం తరువాత తెలియజేస్తామన్నారు.

కొత్తూరు: స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న నాలుగు ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పిఒ విమలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మండలం నీలకంఠాపురం బిసి, కురిగం బిసిబి, హిరమండలం మండలం బొట్టడాసింగి ఒసి, నవగుడా ఒసి కేటగిరీలో ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు చెప్పారు. 7వ.తరగతి ఉత్తీర్ణులై వివాహితతతో పాటు స్థానిక మహిళ అయి ఉండాలని, వయస్సు 21 నుంచి 35.సంత్సరాలు నవంబర్ 1, 2023 నాటికి నిండి ఉండాలని సూచించారు. ఈ నెల 22 నుంచి 30 సాయంత్రం 5 గంటలులోపు దరఖాస్తులను ప్రాజెక్టు కార్యాలయానికి అందజేయాలని, ఇంకా ఏమైనా అనుమానాలుంటే ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రొయ్యల చెరువుల పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ డిటి శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండలం తీర ప్రాంత గ్రామంలో ఉన్న అక్రమ రొయ్యల చెరువుల సమస్యలపై మత్స్యశాఖ అధికారి పివి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. అక్రమ రొయ్యల చెరువులపై విచారణకు రైతులు సహకరించకపోవడంతో మరోసారి వస్తామని అధికారుల బందం వెనుతిరిగారు, పెద్ద లక్ష్మీపురం వద్ద అక్రమ రొయ్యల చెరవులతో తమ పంట పొలాలు నాశనమవుతున్నాయని ఆ గ్రామానికి చెందిన రైతు ఫిర్యాదు మేరకు శనివారం మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్ పివి శ్రీనివాసరావు, తహసీల్దార్ గురుప్రసాద్‌తో కలసి పెద్దలక్ష్మీపురంలోని రొయ్యల చెరువులను పరిశీలించారు. అనంతరం రైతులు, చెరువుల యజమానులతో మాట్లాడారు. ఇరువర్గాల విచారణలో రైతులు అధికారులకు సహకరించకపోవడంతో మరోసారి వచ్చి విచారణ చేపడతామని అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందించి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడి సత్యనారాయణ, ఎల్డివో ముసలినాయుడు, విఎఫ్ఎ ముబిన్ అబ్దుల్లా, విఆర్ఒ సంతోష్, దున్న గురుమూర్తి, బి.కళ్యాణ్ పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

అధికారులను ప్రశ్నిస్తున్న తుంగపేట సర్పంచ్ వేణుగోపాలం

పొందూరు: గ్రామాల్లో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు అంటూ బాగా ఉన్న సిమెంట్ రోడ్లను తవ్వేసి వదిలేశారని టిడిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చైతన్యను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా రేషన్ బియ్యం ఇవాల్సి ఉండగా, ఒక్క కేంద్ర ప్రభుత్వం బియ్యమే ఇస్తున్నారని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన రేషన్‌కార్డులకు మాత్రం రాష్ట్రం వాటా బియ్యం ఇవ్వడం ఏమిటని నిలదీశారు. తుంగపేట బిసి కాలనీలో రహదారులను ఇరువైపులా తవ్వేయడంతో నివాసయోగ్యం కాని పరిస్థితి నెలకొందని సర్పంచ్ వేణుగోపాలం అధికారులను ప్రశ్నించారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంపిటిసి-4 బాడాన హారిక అధికారులను డిమాండ్ చేశారు. రాత్రివేళల్లో రైతు భరోసా కేంద్రాల్లోని ఎరువుల పంపిణీ చేపట్టి పక్కదారి పట్టిస్తున్నారని ఎంపిటిసిలు సీతారామారావు, హనుమంతురావు, సర్పంచ్‌లో రాంప్రసాద్, పోలినాయుడులు అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ ఇనుప స్తంభాలు మార్చాలని చెప్పినా పట్టించుకోకపోవడం ఏమిటని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు విద్యుత్ ఎఇ దుర్గాప్రసాద్‌ను ప్రశ్నించారు. వి.ఆర్.గూడెంలో పాడైపోయిన స్తంభాలు మార్చాలని ఎంపిటిసి అన్నెపు కుమారి కోరారు. కోటిపల్లిలో విద్యుత్ లైన్లు కలిసిపోయి ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి సభ దృష్టికి తీసుకెళ్లారు. కింతలిలో విఆర్ఒ వారం రోజులుగా రావడం లేదని, ఒకవేళ ఆమె వచ్చానా మధ్యాహ్నం వస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే నేను ఇలాగే వస్తానని ఆమె చెబుతున్నారని ఎంపిటిసి హనుమంతురావు తహశీల్దార్ వై.వి.ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లారు. గోరింటలో ఆధార్‌ను ట్యాంపరింగ్ చేసి వయసును మార్చివేసిన పలువురికి పింఛన్లును అందిస్తున్నారని, దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్లనున్నట్లు సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి అధికారులకు తెలియజేశారు. అనంతరం పలు విషయాలుపై తీర్మాణాలను చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

నినాదాలు చేస్తున్న నాయకులు

టెక్కలి : ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ప్రజా పోరాటాలు అవసరమని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ప్రజా ఉద్యమాల వేగుచుక్క పైల చంద్రమ్మ 3వ వర్ధంతి సభ స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఫాసిస్టు, మతోన్మాద మనువాద పాలన సాగుతుందని దుయ్యబట్టారు. సనాతన సాంప్రదాయాల పేరుతో అణచివేతకు మరింత వెనుకబాటుతనానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి కోత ధర్మారావు మాట్లాడుతూ అడవుల్లో ఉండే ఖనిజాలను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు ఆదివాసీలను ఖాళీ చేయించే దుర్మార్గమైన చర్యలకు ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని అన్నారు. అనంతరం అరుణపతాకాన్ని ఎగురవేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా చంద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు భీమశంకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సోమేశ్వరరావు, ఎస్.రామారావు, ఆదివాసీ జిల్లా నాయకులు సవర బంగ్లా కుమార్, బదకల ఈశ్వరమ్మ, మద్దిల వినోద్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారు దగ్ధం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద శనివారం అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రయాణిస్తున్న వ్యక్తులు మంటలను ముందుగానే గుర్తించి కారులో నుంచి దిగి ప్రాణాలతో బయటపడ్డారు. అందులో ప్రయాణిస్తున్న వారు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి ప్రాంత వాసులుగా గుర్తించారు. వ్యక్తిగత పనిపై కారుడలో శ్రీకాకుళం వచ్చారు. డేఅండ్‌నైట్ ప్రాంతంలోని కొత్త బ్రిడ్జి వద్దకు రాగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో ఆ సమయంలో కారు డ్రైవింగ్‌లో ఉన్న వ్యక్తి బయటకు రాగలిగాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని విచారిస్తున్నారు.

పోటాపోటీగా లడ్డూల వేలం

కవిటి : 40 కేజీల లడ్డూతో రమ్య

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న లడ్డు వేలం పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వందలు, వేలు దాటి లక్షలకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా కవిటి మండలం డిజి పుట్టుగ గ్రామంలో 40 కేజీల వినాయక లడ్డును చిన్నబడాం గ్రామానికి చెందిన గొండ్యాల చంద్రశేఖర్, రమ్య దంపతులు రూ.1,40,500లకు దక్కించుకుని పలువురి ప్రశంసలు అందుకున్నారు. వీరికి లడ్డుతో పాటు 150 గ్రాముల వెండి వినాయక విగ్రహాన్ని కమిటీ సభ్యులు అందజేశారు. అదే మండపంలో చిన్న లడ్డును అదే గ్రామానికి చెందిన బెందాళం భువన్ రూ.34,500లకు దక్కించుకున్నారు. మండలంలోని ప్రతీ వినాయక మండపంలో లడ్డు రూ.5 వేల నుంచి రూ.50 వేల పైబడి ధర పలకడం గమనార్హం. మరోవైపు గణనాధుని అనుపు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మేళతాళాలు, బాజా భజంత్రీలు, మందుగుండు సామాగ్రితో చిన్నా, పెద్దా తేడా లేకుండా కేరింతలు కొడుతూ వినాయక నిమజ్జనం చేస్తున్నారు.

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూని వేలం వేశారు. ఈ లడ్డూను రూ.2.30 లక్షలకు అదే గ్రామానికి చెందిన కొలాలాపు కరువు పాట పాడి దక్కించుకున్నాడు. మండలంలోని ఇంత ధరకు లడ్డూ పాట పాడడం ఇదే ప్రథమం.

కొత్తూరు : లడ్డూను తీసుకెళ్తున్న దంపతులు

పలుచోట్ల అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

ఆమదాలవలస: పట్టణంలోని 17వ వార్డు పూజారిపేటలో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో యువకులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ యూత్ సభ్యుడు పైడి వసంత్ మాట్లాడుతూ ప్రతి ఏటా వినాయక చవితి సందర్భాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 3000 మంది వరకు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యూత్ సభ్యులు బలివాడ తిరుపతిరావు, చిగురుపల్లి వెంకటేష్, పేడాడ సతీష్, కిల్లి సతీష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ ఫౌండేషన్ శ్రీకాంత్, న్యూ బ్లడ్ బ్యాంకు మణికంఠ, జెసిఐ.మణిశర్మ, అనిల్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: గోవిందపురం యాదవ వీధిలో శనివారం సుమారు రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వినాయక పూజ సందర్భంగా అన్న సంతర్పణ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఇరవై ఐదేళ్లుగా ప్రతి ఏడాది అన్నదానం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. చివరి రోజు వినాయకునికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస రావు, సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, కమిటీ అధ్యక్షులు పాలిన ఉమా మహేశ్వర రావు, కమిటీ సభ్యులు కణితి వెంకట భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి

డిపట్టా హక్కు వారసులకే

ప్రజాశక్తి- లావేరు

ఒరిజినల్ డిపట్టదారులు వారి వారసులకే తప్ప ఇతరులకు ఆ భూమి బదలాయింపు ఎట్టి పరిస్థితుల్లో జరగదని తహశీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా పాతకుంకాం ఎంపిటిసి సభ్యుడు జనపాల భానోజీరావు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం ఇచ్చిన డీ పట్టాలు పోయాయని, రీ సర్వేలో ఆ భూమి సాగులో ఉన్న వారి పేరున నమోదు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తహశీల్దార్ సమాధానమిస్తూ... అలా జరగదని, ఒరిజినల్ డీపట్టాదారు వారసుల పేరునే నమోదు చేయడానికి హక్కు కలిపిస్తామని అన్నారు. మండలంలో సుమారు మూడు వేల ఎకరాలకు పైగా డీ పట్టాల భూములు ఉన్నాయని, ఇప్పటి వరకు 2,500 డీ పట్టా భూములు గుర్తించామని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 18 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామని అన్నారు. విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతుందని సభ్యులు ఎఇ కె.అప్పన్న వద్ద ఏకరువు పెట్టారు. ఎఇ మాట్లాడుతూ తోటలు అధికంగా ఉండటంతో లైన్లు కలిసిపోతున్నాయని, దీంతో ట్రిప్ అవుతుందని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన ఆర్‌డిడిఎస్ పథకంలో వ్యవసాయానికి నిరంతరంగా 9 గంటలు గృహావసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు వేర్వేరే లైన్ అవసరమని అన్నారు. ఇప్పటికే మండలంలో కేసవరాయనిపాలెం 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాల్లో రెండు ఫీడర్లు, లావేరు, అదపాక, బుడుమూరు ఉప కేంద్రాలోని రెండేసి ఫీడర్లలో సర్వే చేశామని అన్నారు. మండలంలో 3,814 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, 17,389 గృహ అవసరాల సర్వీసులు ఉన్నాయని అన్నారు. మండలంలో నాడు-నేడు పథకం చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనుల సమయంలో ఎంఇఒ ఈశ్వరరావు తమకు తెలియజేయడం లేదని మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్, ఎం.సునీత, మత్స్యశాఖ నుంచి శారద, జెసిఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షం

కూలిన భారీ వృక్షం

బూర్జ: మండలంలోని లాభం నుంచి గుత్తావిల్లి వెళ్లే రహదారికి మధ్యలో శనివారం ఉదయం భారీ వృక్షం కూలింది. అయితే అదే సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిపోయిందని స్థానికులు తెలిపారు ఈ చెట్టు పడిపోవడంతో అటు సంతకవిటి మండలం నుంచి ఇటు మామిడివలస గ్రామాల నుంచి శ్రీకాకుళానికి వెళ్లే వాహనదారులు , ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం వరకు కూడా కూలిన వక్షాన్ని తొలగించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ఆర్అండ్‌బి అధికారులు జోక్యం చేసుకొని చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికుల కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కవిటి

గొంతు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కవిటి గ్రామానికి చెందిన పొల్లాయి లక్ష్మీనారాయణకు కవిటి ఉషోదయ యువజన సంఘం అండగా నిలిచింది. శనివారం ఉషోదయ యువజన సంఘం సభ్యులు బాధితునికి రూ.22,500లు అందించారు. బాధితుడికి దాతలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సౌమ్య

కెజిబివిలో తల్లిదండ్రుల సమావేశం

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆధ్వర్యాన శనివారం విద్యార్థినుల తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసం, వారి ఆరోగ్యం, భోజన, వసతి సదుపాయాలు, నాడు-నేడు పనులకు సంబంధించిన పలు విషయాలను చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపహార్ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ అప్పారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- కవిటి

ప్రతి ఇంట్లో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి గడప గడపకు కార్యక్రమం చేపడుతున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. కవిటి మండలంలోని డిజిపుట్టుగ పంచాయతీ వి జల్లుపుట్టుగ, తిప్పనపుట్టుగ గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు తమకు రేషన్ కార్డు లేదని, రైతు భరోసా అందడం లేదని, అమ్మఒడి పడలేదని విజయ దష్టికి

సమస్యలు వివరిస్తున్న బెంతు ఒరియా యువకుడు

తీసుకువచ్చారు. అదే విధంగా తిప్పనపుట్టుగ గ్రామంలో కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేసి తమకు న్యాయం చేయాలని పలువురు బెంతు ఒరియాలు కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ ఇప్పటికే మీకు నేటివిటీ సర్టిఫికెట్ ప్రభుత్వం అందిస్తోందని, మిగిలిన సమస్యపై ఇప్పటికే ప్రభుత్వంలోని వివిధ విభాగాల పెద్దలు, అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, సర్పంచ్ కిరణ్ కుమార్, యుగంధర్ పాల్గొన్నారు.

బొరివంకలో పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి- కవిటి

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరాం ప్రసాద్ అన్నారు. కవిటి మండలం బొరివంక గ్రామంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు నేరుగా ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సూపర్‌వైజర్ పల్లవి పోషకాహార లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్వాడీలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు వివరించారు. ఈ

పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ శ్రీరాం ప్రసాద్, ఎంపిటిసి సతీష్

సందర్భంగా పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, బల్లెడ జయ ప్రకాష్, లోళ్ల శ్రీను, క్లస్టర్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాఫీ విత్ క్లాప్ పాటించాలి

కొత్తూరు : గ్రామాల్లో ఉదయం పారిశుధ్య కార్మికులు వద్దకు గ్రామ కార్యదర్శి వెళ్లి కాఫీ విత్ క్లాప్‌ను పాటించాలని ఎం.పిడిఒ ఎం. పావని అన్నారు. శనివారం స్థానిక ఎస్.డబ్ల్యు యుపిసి సెంటర్ వద్ద పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో సఖ్యతగా ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల గౌరవ వేతనాలకు సంబంధించి బిల్లు పెట్టామని, త్వరితంగా వేతనాలు మంజూరు చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి ఏ నెల గౌరవ.వేతనం ఆ నెల ఇస్తామన్నారు. ఈ ఇఒపిఆర్‌డి కె.కస్తూరావు, సెక్రటరీ భుట్టోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో రోడ్లు ధ్వంసం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు అభివృద్ధి పేరుతో ధ్వంసం చేసి మూడున్నర ఏళ్లు కావస్తున్నా రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు ఎందుకు పట్టించుకోవడంలేదని కాశీబుగ్గకు చెందిన సామాజిక కార్యకర్త మాన్యాల శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. కాశీబుగ్గ కె టి రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. పలాస ప్రాంతానికి వస్తున్న ఇతర ప్రాంతాల ప్రజలు సైతం మున్సిపాలిటీ రోడ్లు చూసి చీదరించు కుంటున్నారన్నారు

శిక్షణా శిబిరాలతో విద్యార్థులకు మేలు

రణస్థలం: విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎఇ వి.ధనుంజయరావు సూచించారు. మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఇంటర్న్ షిప్ విద్యార్థులకు సచివాలయాల విధులు, పౌరుల బాధ్యతలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. చదువుకునే సమయంలో నిర్లక్ష్యం చేస్తే జీవితంలో విజయాలు కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ప్రకాశ్

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌ను సినిమా నిర్మాత డాక్టర్ బలగ ప్రకాశ్ గౌరవపూర్వకంగా కలిశారు. సబ్ కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ వైద్యానికి పెద్దపీట

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జ మోహన్‌రెడ్డి అన్నారు. సచివాలయ ఆవరణలో పిఎంజెఎవై ఆయుష్మాన్‌భవ కార్డులను శనివారం పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం గెలిచింది

ఇచ్ఛాపురం : తమపై కక్షపూరితంగా పెట్టిన కేసులో ఎట్టకేలకు న్యాయం గెలిచి నిర్దోషులుగా బయట పడ్డామని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, ప్రస్తుత వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2017 ఆగస్టులో అప్పటి సబ్ రిజిస్ట్రార్ గరుగుబెల్లి రాజులు, తనపై, తన భర్త లాభాల శంకర్ కుమార్‌పై మామూళ్లు వసూళ్లు చేసినట్లు, బెదిరించినట్లు టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఫిర్యాదుపై అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ మంగరాజు సమగ్రంగా విచారణ చెయ్యకుండా కేసు నమోదు చెయ్యడంతో తామెంతో మానసిక క్షోభకు గురయ్యామన్నారు. ఈ కేసులో గత నెల 25న ఇచ్ఛాపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మమ్ముల్ని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు చెప్పినట్లు వీరు మీడియాకు తెలిపారు. కేవలం మా దంపతులను ఏదోరకంగా కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టాలని కుట్ర పన్నిన ఫిర్యాదుదారుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇద్దరూ కలసి అప్రదిష్టపాలు చేసినందుకు పరువు నష్టం దావా వెయ్యడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం

కొత్తూరు : సచివాలయాల పరిధిలో వివిధ పనులకు సంబంధించి నగదు.చెల్లించకుండా నేరుగా నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 43 పంచాయతీల పరిధిలో ఉన్న 27 సచివాలయాల సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను, విద్యుత్.చార్జీలు, లైసెన్సులు, ఫీజులు, లే ఔట్ ఫీజులు స్కానర్‌కు ఫోన్ పే చేస్తే సరిపోతుందన్నారు. దీనికి సంబంధించి డిపిఆర్‌సిలో మండలానికి చెందిన ఒక కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంటుకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కె.కస్తూరావు, పిఎస్ శ్యామ్ సుందర్, మనోజ్‌లు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలం కిల్లిపాలెంకు చెందిన రామ నగేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. నగరంలోని జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హుటాహుటిన ఆస్పత్రికి శనివారం చేరుకుని వైద్యులతో మాట్లాడి అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమెతో పాటు పరామర్శించిన వారిలో జిల్లా జూనియర్ ఎన్‌టిఆర్ అసోసియేషన్ సభ్యులు దుంగ శ్రీధర్, మాజీ సర్పంచ్ రెడ్డి రమణమూర్తిలు హాజరయ్యారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

కవిటి : కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బల్లెడ రవీంద్ర, అజి దంపతులు లక్ష రూపాయలు విలువచేసే వెండి కిరీటం శ్రీ చింతామణి అమ్మవారికి బహూకరించారు. సర్పంచి పూడి అబ్బాయి, మాజీ సర్పంచులు ఆరింగి మధు, పాండవ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు బెందాళం రంగారావు, బెందాళం వెంకటేశ్వరరావు, శ్రీను, పొల్లాయి లక్ష్మణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నెరవేరిన అచ్చిపోలవలస వాసుల కళ

పొందూరు: శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో అచ్చిపోలవలసకు బిటి రోడ్డు నిర్మించడంతో ఆ గ్రామస్తుల కళ నెరవేరిందని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని అచ్చిపోలవలస రహదారి నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఎంతో కాలంగా సరైన రహదారి లేక గ్రామస్తులు నానా అవస్థలు పడ్డారని, ఎట్టకేలకు రహదారి నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు కృతజ్ఞతలను తెలిపారని పేర్కొన్నారు.

పనులను పరిశీలిస్తున్న రమేష్‌కుమార్